


అక్కడ దయ్యం ఉండేది. అందుకని ఆ ఇల్లు పాడుపెట్టారు. ఆ ఇంట్లో రాధతల్లి చనిపోయింది. రాధతల్లి దయ్యమయిందని అందరికీ తెలుసును. కాని, అంత మహాఇల్లాలును దయ్యమనటానికెవరికీ నోరు రాలేదు.

రాధకు దయ్యమంటే భయమే. ఆ ఇల్లంటేనూ భయమే. ఆ ఇంట్లో ఉన్న దయ్యం పొరుగింటి మహాలక్ష్మమ్మకు పట్టినప్పుడు మహాలక్ష్మమ్మను చూసి రాధ భయపడి, ఒకరోజల్లా కన్ను మూసిఎరగదు.

కాని, ఆ ఇంట్లోనే ఉంది అమ్మ. "అమ్మేదే" అని తను యేడ్చినప్పుడు, "ఆ ఇంట్లో ఉందమ్మా?" అని అమ్మమ్మ చెప్పలా? అయితే ఆ యింట్లోనే దయ్యం ఉందికదా! అమ్మకు భయం కాదూ? అన్నట్లు అమ్మకు భయంలేదు. తనకు చీకట్లో పోవటానికి భయం వేస్తే అమ్మ తోడు వచ్చేది కాదూ!

రాధకు ఒక్కసారి అమ్మను చూడాలనిపించింది. ఎవరన్నా చూస్తే కోప్పడతారు. అందుకని రాధ ఒకనాడు, ఒక రాత్రివేళ అమ్మ ఉన్న యింటికి—దయ్యం ఉన్న యింటికి బయలుదేరింది.

బిక్కు బిక్కు మనే ఆ ఇంట్లో అడుగు పెట్టినప్పుడు రాధకు భయం వెయ్యలేదు.

"అమ్మా!" అని పిలిచింది.

జవాబు రాకపోవటం చూసి, "నువ్వు లోపల లేవుటే అమ్మా!" అన్నది రాధ, అనుమానంతో.

"నా కోసం వచ్చావుటే, నాతల్లీ?" అన్నది రాధ.

"నీకోసం వచ్చానే!" అన్నది రాధ.

"నేను నీ కోసం కనిపెట్టుకున్నానే!" అన్నది రాధ.

*కొడవటిగంటి కుటుంబరావు*



"ఈనాట్కి జెట్లు వొచ్చినయ్‌గాని, ఏనాటినుంచో యీ దేశంలో మా జెట్కాలు ఉండాయ్ సార్ !"

"ఇన్నిరోజులు నాకు కనపళ్లేదేమే, అమ్మా?" అన్నది రాధ.

"నేను నీకోసం ఇక్కడే ఉన్నానే." అన్నది రాధ.

"నేను నీ దగ్గిర పడుకోవద్దుటే, అమ్మా?" అన్నది రాధ.

"నిన్ను నిద్రపుచ్చుతాను రావే, తల్లీ" అన్నది రాధ.

మర్నాడు రాధకోసం అందరూ వెతికారు. ఆ దయ్యాల కొంపలో కటిక నేలమీద, ఆ దుమ్ములో బోర్లా పడుకుని గాఢనిద్రలో కనిపించింది రాధ.

రాధను లేపి వాళ్ళవాళ్ళు, అక్కణ్ణించి తీసుకుపోయినారు.

"నే నమ్మదగ్గిర పడుకున్నానే? నే నమ్మదగ్గిరే ఉంటానే!" అని మూడేళ్ళ రాధ పెనుగులాడింది.

"అయ్యో, ఇంకేమమ్మే! మీ అమ్మ చచ్చిపోయి దయ్యమయిందే!" అన్నారు రాధ బంధువులు.

రాధ అకారణంగా ఏడవటం మొదలు పెట్టింది. ఏం చేసినా ఆ ఏడుపు పోలేదు. అందర్నీ కొట్టడం మొదలు పెట్టింది. ఎవరో మల్లే మాట్లాడటం మొదలు పెట్టింది.

రాధకు దయ్యం పట్టిందన్నారు. విభూది పెట్టించారు. ముగ్గులు వేయించారు. రాధ పోరు మానలేదు. తనకు పథ్యం పెట్టటానికి వచ్చినవాళ్ళమీదా, తన తల్లిని దయ్యమన్న వాళ్ళమీదా రాధ నిప్పులు కక్కేది; పళ్ళు పటపటా కొరికేది; ఏది దొరికితే అది వాళ్ళమీద గిరాటు వేసేది.

వారంరోజుల్లో రాధ చిక్కి శల్యమయి మంచం పట్టింది. రాధగొంతు పెలుగు రాకుండాపోయింది. హీనస్వరం పడ్డది. రాధ మంచినీళ్ళుకూడా మానేసింది.

మరో నాలుగయిదు రోజులకు రాధ అంతరించింది.

రాధను తల్లి దయ్యమై పట్టి తీసుకుపోయిందని అంతా అనుకున్నారు.